
# అటవీ హక్కు... గుటుక్కు!

## ఎడాపెడా అనుమతులు




శ్రీకాకుళం జిల్లాలో పచ్చని నేలల్లో థర్మల్ ప్రాజెక్టు ఏర్పాటు చేసి తమ బతుకులు బుగ్గి చేయొద్దని నినదించిన అమాయక ప్రజలపై పోలీసులు తుపాకులు ఎక్కుపెట్టిన వైనం- పాలన వ్యవస్థల ఘోర వైఫల్యానికి నిదర్శనం. ఇద్దరి బలిదానం తరవాతగాని పర్యావరణ మంత్రిత్వశాఖ పనుల నిలిపివేతకు ఆదేశాలు జారీచేయలేదు. జరిగిన పరిణామాలకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ బాధ్యత వహించాలన్న వాదనలు సమంజసమైనవే! పెట్టుబడిదారుల ఒత్తిళ్లకు ఆ శాఖ లొంగిపోతోందనడానికి కాకరాపల్లి ఉదంతమే తాజా రుజువు. నౌపడ చిత్తడి నేలలు పరిరక్షించుకోదగిన విశిష్ట పర్యావరణ ప్రాంతమని ముంబై నేచురల్ హిస్టరీ సొసైటీ, రాష్ట్ర అటవీ శాఖ, జాతీయ అప్పిలేట్ అథారిటీ లాంటి సంస్థలు ఇచ్చిన నివేదికలను కేంద్ర మంత్రిత్వశాఖ ఏ కోశానా పట్టించుకోలేదు. సమీపంలోని తేలినీలాపురం వలస పక్షుల ఆవాస కేంద్రంతో కలిపి ఆ ప్రాంతాన్ని సున్నితమైన పక్షుల ఆవాస కేంద్రంగా గుర్తించాలన్న సిఫార్సులనూ గాలికి వదిలేసింది. ఆ సంస్థలు అందజేసిన నివేదికలపై మంత్రిత్వశాఖ రెండు సంవత్సరాల క్రితమే తగువిధంగా స్పందించి ఉంటే- ఇప్పుడింత ఘోరం జరిగి ఉండేది కాదు.

### ఒత్తిళ్లకు దాసోహం

కాకరాపల్లి ప్రాజెక్టు ప్రతిపాదన మంత్రిత్వశాఖ దగ్గరకు వచ్చింది మొదలు- అన్నిస్థాయిలకూ తప్పుడు సమాచారం అందజేశారు. పర్యావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్(2006) ప్రకారం తప్పుదోవ పట్టించే సమాచారం ఇచ్చిన ప్రాజెక్టులను మంత్రిత్వశాఖ తిరస్కరించవచ్చు. అయినా ప్రాజెక్టు పనుల ఆరంభాన్ని ఆ శాఖ నిలువరించలేకపోయింది. బడా పెట్టుబడుదారుల ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చే రబ్బరు స్టాంపుగా ఆ శాఖ మారిందన్న ముద్ర పడిపోయింది. శాఖలో వేళ్లూనుకున్న వ్యవస్థాపరమైన లోపాలను సరిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు. రెండు సంవత్సరాల క్రితం పర్యావరణ శాఖ మంత్రిగా జైరాం రమేశ్ బాధ్యతలు స్వీకరించినప్పుడు- దిద్దుబాటు చర్యలు చేపడతారని అందరూ అనుకున్నారు. సోంపేట, కాకరాపల్లి, పోస్కో, వేదాంత, లావాసా, ఆదర్శ, జైతాపూర్ లాంటి బడా ప్రాజెక్టులకు, అనేక గనులకు, థర్మల్ ప్రాజెక్టులకు మంత్రిత్వశాఖ అనుమతులు జారీచేసిన తీరు చూశాక- ఆ ఆశలన్నీ అడియాశలేనని అర్థమైపోయింది. ఒత్తిళ్లకు లొంగిపోయి అనుమతులు ఇవ్వడం, అవి వివాదాస్పదమయ్యాక నిపుణుల కమిటీలను వేయడం పరిపాటిగా మారింది. సీఆర్‌జెడ్, చిత్తడి నేలల పరిరక్షణ, గ్రీన్ ట్రైబ్యునల్ వంటి కీలక పరిరక్షణ యంత్రాంగాల ఏర్పాట్లలోనూ ఇదే అలసత్వాన్ని ప్రదర్శిస్తోంది.

పర్యావరణ అనుమతుల జారీ ప్రక్రియను కట్టుదిట్టం చేస్తున్నామని మంత్రిత్వశాఖ చెబుతున్న మాటలన్నీ బూటకమని అనేక అధ్యయనాలు రుజువు చేస్తున్నాయి. న్యూఢిల్లీకి చెందిన ఇఐఎ రిసోర్సు, రెస్పాన్స్ సెంటర్ సేకరించిన గణాంకాల ప్రకారం, గడచిన రెండేళ్లలో శాఖ పనితీరు ఘోరంగా మారిందని స్పష్టమవుతుంది. 2009 ఆగస్టునుంచి, 2010 జులై వరకు ప్రమాదకర పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి పర్యావరణ అనుమతులకోసం 769 ప్రతిపాదనలు మంత్రిత్వశాఖకు అందాయి. వాటిల్లో 535 ప్రాజెక్టులకు నిపుణుల కమిటీలు అనుమతులు మంజూరు చేయగా, ఆరు ప్రతిపాదనలు మాత్రమే తిరస్కరణకు గురయ్యాయి. 58 బొగ్గుగనుల పనులకు, 283 పారిశ్రామిక ప్రాజెక్టులకు ఎడాపెడా అనుమతుల లభించాయి. 93 థర్మల్ ప్రాజెక్టుల ప్రతిపాదనల్లో తిరస్కరణకు గురైంది కేవలం ఒక్కటే! 146 గనుల ప్రాజెక్టుల్లో మూడింటిని మాత్రమే తిరస్కరించారు. ఒకపక్క అనుమతులు జోరుగా ఇచ్చేస్తున్న పర్యావరణ మంత్రిత్వశాఖ- బాధితుల ఫిర్యాదులను పరిశీలించి, పరిష్కరించే గ్రీన్ ట్రైబ్యునళ్లను పట్టాలకెక్కించే విషయంలో మాత్రం నిర్లిప్తంగా వ్యవహరిస్తోంది.

జైరాం రమేశ్ ఏడాదిన్నర పదవీకాలంలో తీసుకొచ్చిన వ్యవస్థీకృత మార్పుల్లో కీలకమైనది గ్రీన్ ట్రైబ్యునల్ చట్టం-2009. పర్యావరణ నష్టాలకు పరిహారంతోపాటు తప్పుచేసినవారికి శిక్షలు విధించాలన్నది ఈ చట్టం ముఖ్యోద్దేశం. ఆ మేరకు పర్యావరణ కోర్టులు ఏర్పాటు చేయాలి. ట్రైబ్యునల్ ఛైర్మన్‌గా సుప్రీంకోర్టు న్యాయమూర్తి లోకేశ్వర్ సింగ్‌ను నియమించి ఆరు నెలలు గడిచినా- ఇప్పటికీ ఫిర్యాదులు స్వీకరించడానికి అది సిద్ధం కాలేదు. చట్టం అమల్లోకి రావడంతో అంతకుముందు ఉన్న జాతీయ పర్యావరణ అప్పిలేట్ అథారిటీ (ఎన్ఇఏఏ) మాత్రం రద్దయింది. దాంతో పర్యావరణ సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించే యంత్రాంగం ఏదీ ప్రస్తుతం అందుబాటులో లేదన్నమాట. ఈ విషయాన్ని గమనించిన సర్వోన్నత న్యాయస్థానం మంత్రిత్వ శాఖ పనితీరును తీవ్రంగా తప్పుపట్టింది. వారం రోజుల్లో గ్రీన్ ట్రైబ్యునల్ పని ప్రారంభం కావాలని నిరుడు డిసెంబరు 14న సుప్రీం ధర్మాసనం మొట్టికాయలు వేసింది. మూడు మాసాలు గడుస్తున్నా మంత్రిత్వశాఖ ఇంకా సభ్యులకోసం వెదుకులాటలోనే కాలం గడుపుతోంది. కాకరాపల్లి వివాదంలో ఈస్ట్‌కోస్ట్ ప్రాజెక్టు పర్యావరణ అనుమతిని సవాలు చేస్తూ స్థానికులు పర్యావరణ అప్పిలేట్ అథారిటీనే ఆశ్రయించారు. సోంపేట, కాకరాపల్లి అనుమతులపై విచారణ ఒకే క్రమంలో జరిగింది. అప్పిలేట్ అథారిటీ సభ్యులు జె.సి.కళా, చిత్తడి నేలల నిపుణులు సిద్ధార్థకౌల్ సోంపేట, కాకరాపల్లి ప్రాజెక్టు స్థలాలను పరిశీలించి, అవి పరిరక్షించాల్సిన అవసరమున్న నేలలని ధ్రువీకరించారు. అప్పిలేట్ అథారిటీ సోంపేట ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి రద్దు చేసి, ఈస్ట్‌కోస్ట్ ప్రాజెక్టుకు మాత్రం షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. దీన్ని సవాలుచేసే సమయానికి గ్రీన్ ట్రైబ్యునల్ ప్రక్రియ అమలు ప్రారంభమైంది. అయినా, కోర్టులు ఏర్పడకపోవడంతో మరో న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశంలేని స్థానికులు గ్రీన్ ట్రైబ్యునల్ ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్నారు. దీన్ని అవకాశంగా తీసుకుని, ఈస్ట్‌కోస్ట్ చిత్తడి నేలలను ధ్వంసం చేస్తుండటం స్థానికులకు మరింత ఆగ్రహం కలిగించింది. అప్పిలేట్ అథారిటీ నిబంధనల్నీ బేఖాతరు చేస్తూ నిర్మాణ కార్యక్రమాలు చేపడుతున్నా, అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. తొలుత ఆంధ్రప్రదేశ్ సర్కారు ఈస్ట్‌కోస్ట్ కంపెనీకి 3333.45 ఎకరాల భూమిని కేటాయించింది. కంపెనీ మాత్రం 1960ఎకరాలనే 'ఎక్స్‌పర్ట్ ఎప్రైజల్ కమిటీ' (ఇఏసి)కి నివేదించింది. ఆ మేరకే షరతులతో కూడిన అనుమతి వచ్చింది. అలాగే, జాతీయ పర్యావరణ అప్పిలేట్ అథారిటీ విధించిన షరతుల ప్రకారం 1317 ఎకరాలను మాత్రమే నిర్మాణాలకోసం వినియోగించాలి. మిగతా 2016 ఎకరాల భూమిని కంపెనీ ప్రభుత్వానికి అప్పగించాలి. రెవెన్యూ, ఏపీఐఐసీ ఈ భూమిని వెనక్కు తీసుకోవడంలో చొరవ చూపకపోగా, దాన్ని ప్రశ్నించిన స్థానికులపై పోలీసులను ఉసిగొల్పడం ఎంత అన్యాయం?

ప్రాజెక్టులు వివాదాస్పదమైన తరవాత ఏర్పాటు చేస్తున్న నిపుణుల కమిటీలు నివేదికల్లో చేస్తున్న సిఫార్సులకు సైతం మన్నన దక్కడంలేదు. మంత్రిత్వశాఖ వాటిని తమకు అనుకూలంగా అన్వయించుకొని పర్యావరణ అనుమతులు కొనసాగిస్తోంది. అభివృద్ధి ప్రాజెక్టుకు అటవీ భూమి సేకరణ తప్పనిసరైనప్పుడు- 1980నాటి అటవీ పరిరక్షణ నియమాలతోపాటు, అటవీ హక్కుల గుర్తింపు చట్టం(2006) నిబంధనలను కచ్చితంగా పాటించాలని నిరుడు జులైలో మంత్రి జైరాం రమేశ్ ఆదేశించారు. దాని ప్రకారం గ్రామసభ కమిటీల ఆమోదం తరవాత మాత్రమే ప్రాజెక్టుకు తుది అటవీ అనుమతి ఇవ్వాలి. దేశవ్యాప్తంగా అటవీ హక్కుల చట్టం అమలు తీరు పరిశీలనకు ఎన్.సి.సక్సేనా నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ- పోస్కో ప్రాజెక్టు ప్రతిపాదిత ప్రాంతంలో అటవీ హక్కుల చట్ట నిబంధనలు అమలు పూర్తికాలేదు కనుక అనుమతులను రద్దు చేయాలని సిఫార్సు చేసింది. ఆ సిఫార్సులకు అనుగుణంగా అటవీ హక్కుల చట్టం అమలు పూర్తిచేయాలని ఒరిస్సా ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ మంత్రిత్వ శాఖ ఆదేశాలిచ్చింది. అదే కమిటీ మన రాష్ట్రంలోని పోలవరం ప్రాజెక్టు, విశాఖ జిల్లాలోని బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి అటవీ హక్కుల చట్టం అమలు పూర్తి చేయకుండానే తుది అటవీ అనుమతులు ఇవ్వడం సమంజసం కాదని నివేదించింది. ఒరిస్సాలో పోస్కోకు అమలు చేయాల్సిన నిబంధనలే ఇక్కడా వర్తింపచేయాల్సినా- మంత్రి పట్టించుకోలేదు. తాజాగా నామమాత్రంగా అదనపు షరతులను విధించి అటవీ హక్కుల చట్టం అమలు బాధ్యతలను ఒరిస్సా ప్రభుత్వంపైకి నెట్టేసింది. వేదాంత కంపెనీ విషయంలోనూ జరిగిందదే. నియమగిరి కొండల్లో దశాబ్దకాలంగా దోంగ్రియా తెగ గిరిజనులు సాగిస్తున్న ఉద్యమం అంతర్జాతీయంగా వార్తల్లోకెక్కింది. అక్కడా ఎన్.సి.సక్సేనా నేతృత్వంలో కమిటీవేసి, పర్యావరణ అనుమతి రద్దు చేసింది. బళ్లారి ఇనుప గనులు, విశాఖ బాక్సైట్, శ్రీకాకుళంలో సోంపేట, భావనపాడు, మేఘవరం థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు, పోలవరం ప్రాజెక్టు విషయాల్లో మంత్రిత్వ శాఖ నిబంధనల ఉల్లంఘనలను అసలు పట్టించుకోలేదు. దేశవ్యాప్తంగా వివాదాస్పదమైన జైతాపూర్, ఆదర్శ హౌసింగు, లావాసా వంటి ప్రాజెక్టుల విషయంలోనూ పర్యావరణ మంత్రిత్వ శాఖ చేతులు కాలాకే స్పందించింది. వివాదం వెలుగుచూసే సమయానికి ఆయా ప్రాజెక్టుల్లో కార్యకలాపాలు మొదలై, కోట్ల రూపాయలు ఖర్చయిపోతున్నాయి. ఆ దశలో చెయ్యగలిగిందేమీ లేనట్లు, నామమాత్రం షరతులతో అనుమతులు ఇచ్చే విధానం క్షమించరాని నేరం.

### చట్టాలే ఆయుధాలు

ఏదైనా ప్రాజెక్టు వల్ల తమకు లాభమో, నష్టమో తెలుసుకోవాలంటే ప్రాజెక్టు ఏర్పాటుకు ముందు పర్యావరణ అనుమతుల కోసం ప్రైవేటు కన్సల్టెన్సీలు ఇచ్చే ఇ.ఐ.ఎ. నివేదికలే ప్రజలకు ఆధారం. పెట్టుబడిదారులకు అనుకూలంగా తప్పుడు నివేదికలు ఇస్తూ ఇ.ఐ.ఎ. కన్సల్టెన్సీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. తప్పుడు సమాచారంవల్ల కలిగే నష్టం అపారం. అలాంటి సంస్థల భరతం పట్టాలని, ఈ అంశాన్ని గ్రీన్ ట్రైబ్యునల్ పరిధిలోకి చేర్చాలని వస్తున్న ప్రధాన డిమాండ్‌కూ మంత్రిత్వ శాఖనుంచి ఉలుకూ పలుకూ లేదు. చట్టాలు ప్రజలకు రక్షగా నిలవాలి. నాయకుల, అధికారుల స్వలాభాపేక్షకు, ఆశ్రిత పక్షపాతానికి చట్టాలు పనిముట్లుగా మారనంతవరకూ సమాజ మనుగడ సజావుగా సాగుతుంది. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ విషయంలో చట్టాలను ఉల్లంఘించడమంటే- కూర్చున్న కొమ్మను నరుక్కున్నట్లే! పర్యావరణ పరిరక్షణలో చోటుచేసుకొంటున్న అలాంటి లోపాలను సరిదిద్దుకోవాల్సిన బాధ్యత పాలకులదే!

– గంజివరపు శ్రీనివాస్